క్లుప్తంగా

వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తు చేసుకోండి

సిద్దవటం : వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు కోసం ఈనెల 17వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నామని సిద్దవటం మండల వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీతో వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్ ఆధారిత పనిముట్లు, సస్యరక్షణ పరికరాలు మొదలైనవి వ్యవసాయ యాంత్రికీకరణ కింద అవసరమైన రైతులకు సంబంధిత రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు ఈ కర్షక్ యాప్ ద్వారా అందజేస్తామన్నారు. పూర్తి వివరాలతో సంబంధిత రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఆయన సూచించారు.

నాగారపమ్మకు పూజలు


అలంకరణలో నాగారపమ్మ

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మను ఆదివారం ఉదయం పూజారులు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

సుండుపల్లె : మండల పరిధిలోని పింఛా సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ జూదం ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచిరూ. 42,230లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి


పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి

రాయచోటి టౌన్ : రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని అప్పుడే మంచి గుర్తింపుతోపాటు పేరు ప్రతిష్టతలు లభిస్తాయని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని నూతనంగా ఏర్పాటు చేసిన యశోద హాస్పిటల్‌ను చిన్నపిల్లల డాక్టర్ బయారెడ్డితో కలసి మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం ఎప్పుడు వ్యాపార ధోరణిలో పని చేయకూడదని కేవలం మానవత దృక్పథంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సంగమ్మ, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యం పట్ల అప్రమత్తంగా ఉందాం


చిన్నారికి పరీక్షలు నిర్వహిస్తున్న స్పీచ్ థెరఫిస్ట్ వెంకటేశ్వర్లు

రాజంపేట రూరల్ : వినికిడి సమస్యలు రాకుండా ఉండాలంటే శబ్ద కాలుష్యం పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ స్పీచ్ థెరఫిస్ట్ వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక ఆర్‌ఎస్ రోడ్‌లోని రత్న స్పీచ్ థెరఫీ అండ్ హియరింగ్ సెంటర్‌లో ఆదివారం సొసైటీ ఫర్ అప్లీమెంట్ ఆఫ్ రూరల్ ఎకనామీ ఆధ్వర్యంలో ఉచిత వినికిడి పరీక్ష శిబిరాన్ని స్పీచ్ థెరఫిస్ట్ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 100 మందికి వినికిడి పరీక్షలు ఉచిత నిర్వహించారు. అదే సమయంలో నిరుపేదలైన 18 మందికి ఉచిత వినికిడి యంత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పీచ్ థెరఫిస్టు బాబురావు, సైకాలజిస్ట్ ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న కార్మిక నేత నాగేశ్వరరావు

రాజంపేట రూరల్ : ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఆటో డ్రైవర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఆటోడ్రైవర్లు ప్రభుత్వానికి కోట్ల రూపాయల పన్ను కడుతున్నారని తెలియజేశారు. భారీగా చలానాలు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్ 2131ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రమణ, పెంచలయ్య, వెంకటేశు, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పనులు అర్ధంతరం.. ప్రారంభం ప్రశ్నార్థకం

- అవస్థలమయంగా రాయచోటి - సుండుపల్లె రహదారి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.35 కోట్లతో ప్రారంభమైన పనులు
- ఎన్నికల వేళ నిలిచిన పనులు.. తిరిగి ప్రారంభంకాని వైనం
- చోద్యం చూస్తున్న ఆర్ అండ్ బీ అధికారులు
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు


పనులు నిలిచిపోవడంతో గుంతలమయమైన రాయచోటి - సుండుపల్లి మార్గం


ప్రమాదం అంచున శిబ్యాల దగ్గర ఉన్న బ్రిటీష్ కాలం నాటి వంతెన

సుండుపల్లె : అధ్వానంగా ఉన్న దారిలో ప్రయాణం చేసేందుకు వాహనదారులు, ప్రయాణికులు నరక యాతన పడుతున్నారు. రాయచోటి నుంచి సుండుపల్లె, రాయవరం, పింఛా వరకు అనేక ఆర్టీసీ బస్సులతోపాటు స్కూల్ బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాల ద్వారా వేలాది మంది ప్రయాణికులు అనునిత్యం ప్రయాణం సాగిస్తుంటారు. రెండు వరుసల రోడ్డు అర్ధాంతరంగా ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో ప్రయాణలు సాగించే వాహనాల రాకపోకల కారణంగా అధికంగా దుమ్ము లేస్తుండటంతో ద్విచక్రవాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ కారణంగా చాలా సందర్భాల్లో ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలు పాలవ్వడమే కాక ప్రాణాలను సైతం పోగొట్టుకున్న వారు ఉన్నారు. అర్ధాంతరంగా ఆగిపోయిన రెండు వరుసల రోడ్డు పనులను ప్రారంభించి పూర్తి చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో రెండు వరుసల రోడ్డు మంజూరు

చాలా సంవత్సరాలుగా రాయచోటి - సుండుపల్లె రోడ్డు గుంతలమయమై ఒకే వరుస రహదారి ఉండటంతో చాలా మంది ప్రయాణికులు ప్రమాదాలతో ప్రాణాలను కోల్పోయారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రూ.35 కోట్లతో రెండు వరుసలకు విస్తరణ చేసేలా ప్రణాళికలు రూపొందించి సద్దికోళ్లవంక ఆంజనేయస్వామి దేవాలయం నుంచి భైరవగుట్ట వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి నిధులను విడుదల చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ దాదాపు 60 శాతం పనులను పూర్తి చేశారు. మిగతా పనులు అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడం వలన అక్కడక్కడ పనులను అటవీ శాఖ అనుమతుల కోసం నిలిపివేశారు. అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు జరగకపోవడం వలన రోడ్డు గుంతలమయంగా మారి, అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు రోడ్డు కోతకు గురై వాహనదారులు ఎదురుగా వాహనం వచ్చినప్పుడు పక్కకు దిగాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రమాదాల నివారణతోపాటు అవస్థలు తప్పేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆగిపోయిన శిబ్యాల కాజ్‌వే వంతెన

శిబ్యాల వంకపై వంతెన మీద వేలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిటీష్ కాలం నుండి వంతెనకు మధ్యలో రంధ్రం పడటంతో దానిని పూడ్చడానికి మట్టిని కుప్పగా పోశారు. ఏదైనా పెద్ద వాహనం ఈ వంతెనపైన వెళ్తే మరో ద్విచక్రవాహనం వెళ్లడానికి కూడా వీలు లేకుండా ఉంది. రోడ్డు నిర్మాణానికి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రహదారితోపాటు ఈ వంకపై వంతెన నిర్మాణానికి పెద్ద దిమ్మెలు ఏర్పాటు చేశారు. ఇంతలోనే ఎన్నికలు రావడంతోనే పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి నేటి వరకు ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. పనులు తిరిగి ప్రారంభం అయ్యేలా చూడాల్సిన ఆర్ అండ్ బీ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


శిబ్యాల దగ్గర మధ్యలోనే ఆగిపోయిన వంతెన నిర్మాణం

పనులను సత్వరమే పూర్తి చేయాలి



గత ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులు చేపట్టినప్పటికీ ఎన్నికలు రావడంతో బ్రేక్‌పడ్డాయి. కూటమి ప్రభుత్వ పెద్దలు, రహదారులు, భవనాల శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ఈ రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రయాణికులకు అసౌకర్యంగా ఉన్న రెండు వరుసల రోడ్డును, వంతెన నిర్మాణాల పనులను సత్వరమే చేపట్టి వాహనదారులను ప్రమాదాల నుంచి రక్షించాలని కోరుకుంటున్నాను.

– ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, లీగల్ సర్వీస్ కమిటీ మాజీ సభ్యులు, రాయచోటి

రోడ్డును బాగు చేయించండి



ప్రతి రోజు ఏదో పని మీద ఈ మార్గం గుండా ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఈ రోడ్డులో ద్విచక్రవాహనంలో వెళ్లాలంటే నరకప్రాయం అనే చెప్పాలి. ఎదురుగా ఏదైనా వాహనం వస్తే రోడ్డులో వాహనాన్ని పక్కకు దింపడానికి ఆస్కారం లేకుండా పోయింది. దీంతో తరుచుగా వాహనదారులు ప్రమాదాల బారీన పడి వారి కుటుంబాలను రోడ్డున పడేలా చేస్తున్నారు. దయుంచి అధికారులు పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను పూర్తి చేయించి ప్రజలకు మేలు చేయాలి.

– ఇరుకుదిండ్ల నరసింహులు, సుండుపల్లె

పార్టీ పూర్వవైభవానికి కృషి చేయాలి

సుండుపల్లె : మండలంలో వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పలు సమస్యలపై ఆరా తీశారు. వేసవి కాలం ప్రారంభమవుతుండటంతో మండల పరిధిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ నాయకులతో చర్చించారు. అలానే మండలంలో ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలతో మమేకమై పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ బి.రెడ్డివారిపల్లెలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు దేవపట్ల జనార్దన్‌రెడ్డి మనుమరాలు ధన్విక కేశఖండన కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అలాగే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మైనార్టీ నాయకులు రహీం బాషాతోపాటు టీచర్ కృష్ణంరాజు, రవీంద్రారెడ్డి, గంగిరెడ్డి, రుక్మిణమ్మలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామస్వామిరెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆరంరెడ్డి, మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రెహమాన్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ అమరేశ్వర్‌తోపాటు స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

రాజంపేట రూరల్ : నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆశీర్వదించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం ఎమ్మెల్యే ఆకేపాటి, జ్యోతమ్మ దంపతులు 10వ తరగతి విద్యార్థుల పేరిట పూజలు చేశారు. ప్రతి ఒక్క విద్యార్థి తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేసే విధంగా నిర్మలమైన మనస్సుతో పరీక్షలు రాయలన్నారు. అదే విధంగా మండల పరిధిలోని అప్పారాజుపేట పంచాయతీలోని గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వూరు రాఘవరెడ్డి ఇంట జరిగిన ఓ కార్యక్రమంలో ఆకేపాటి హాజరయ్యారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పెనగలూరు : నేటి నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓలు గిరి వరదయ్య, సుబ్బరాయుడులు తెలిపారు. మండలంలో పెనగలూరు హైస్కూల్, మోడల్ స్కూల్, చక్రంపేట హైస్కూల్ మూడు సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. చక్రంపేట హైస్కూల్‌లో 160 మంది, పెనగలూరు హైస్కూల్‌లో 120 మంది, మోడల్ స్కూల్ హైస్కూల్‌లో 192 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలియజేశారు.

గాలివీడు : నేటి నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన పాత్రికేయలతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల, ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. గుంపులుగా సంచరించవద్దని, జిరాక్స్ సెంటర్లు, దుకాణాలు మూసివేయాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్టాపనోత్సవం


వేంకటేశ్వరస్వామి మూలవిరాట్


శ్రీరాజరాజేశ్వరిదేవి విగ్రహం


ప్రత్యేక పూజలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల గ్రామంలో ఉన్న శ్రీ వెంకట శివసాయి ఆలయం జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధిగాంచింది. ఈ ఆలయ ప్రాంగణంలో నూతనంగా పలు ఆలయాలను ఆలయ చైర్మన్ వెంకటనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించారు. ఆదివారం వేదపండితులు శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ రాజరాజేశ్వరీ దేవీల విగ్రహాల ప్రతిష్టతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ, అన్న ప్రసాదాలను స్వీకరించారు. అంతకుముందు ఆలయం వెలుపుల ధ్వజస్తంభ ప్రతిష్టతను శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా పూజల్లో లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పాల్గొని ప్రతిష్ఠ విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, వి.వి ప్రతాప్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మధు, భానుమూర్తి, ఆనందరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అమ్మవారి జాతరలు


రాయచోటి జగదాంబసెంటర్: దర్శనమిస్తున్న దండువారమ్మ


చిన్నమండెం: ప్రత్యేక అలంకరణలో పాలేటమ్మ


వీరబల్లి: వీరనాగమ్మ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా చాందినీ బండి

రాయచోటి జగదాంబసెంటర్ : పాతరాయచోటిలోని వాల్మీకి వీధిలో వెలసియున్న శ్రీ దండువారమ్మ జాతర ఆదివారం వైభవోపేతంగా ముగిసింది. జాతరను పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. శనివారం రాత్రి అమ్మవారికి కుంకుమబండి కట్టి మెరవణి నిర్వహించారు.

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామంలో కొలువైవున్న శ్రీ పాలేటమ్మ అమ్మవారి జాతర వైభవోపేతంగా ప్రారంభమైంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. అమ్మవారి మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని రాయచోటి డీఎస్పీ కొండయ్యనాయుడు పర్యవేక్షణలో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ ఆదేశానుసారం ఎస్‌ఐ సుధాకర్ ఆధ్వర్యంలో 150 మంది పోలీసులు గట్టి పోలీసు బందోబస్తును నిర్వహించారు. చాందినీబండ్ల రాకతో జాతర ప్రాంగణం కిటకిటలాడనుంది.

వీరబల్లి : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలో వెలసిన వీరనాగమ్మ జాతర ఆదివారంతో ఘనంగా ముగిసింది. శనివారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బిడ్డలు లేని స్త్రీలు అమ్మవారి దగ్గర వరపడ్డారు. మొక్కుబడి ఉన్న వారు అమ్మవారి చుట్టూ చాందినీ బండ్లను తిప్పారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాలయ ధర్మకర్త శ్రీహరి నాయుడు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

కడప రూరల్ : కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ.రమణ అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు గిరిజనుల ఆర్థిక వెనుకబాటును తొలగించడానికి నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ రామక్రిష్ణ, జిల్లా గౌరవాధ్యక్షుడు సుంకన్న, బాబూ నాయక్, డాక్టర్ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

అకుంఠిత దీక్షాపరుడు పొట్టి శ్రీరాములు


రాజంపేట టౌన్: పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆకేపాటి, పోలా


నందలూరు: గెలివి రత్నంశెట్టిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రాజంపేట టౌన్ : అకుంఠిత దీక్షాపరుడు పొట్టిశ్రీరాములు అని, ఆయన త్యాగాన్ని తెలుగు ప్రజలు ఎప్పటికీ మరువలేనిదని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని ఆదివారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే జౌళీ బజారులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి తమిళనాడులో ఉన్న సమయంలో తెలుగువారికి గుర్తింపు లేదని, అలాగే అనేక రకాలుగా తెలుగువారు అవమానాలకు గురవుతుండేవారన్నారు. అందువల్ల తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జెనుగు కృష్ణారావుయాదవ్, వివిధ విభాగాల కన్వీనర్లు ఏల్చూరు అశోక్‌కుమార్, అన్నపూర్ణ మురళీ, బింగి హరి, బొగ్గరపు రాజేష్ గుప్తా, సనిశెట్టి రమేష్, దండు గోపి, జీవీ సుబ్బరాజు, రెడ్డిమాసి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నందలూరు : త్యాగధనులు పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నందలూరు లయన్స్ క్లబ్ వారు ఆయన చిత్రపటానికి పూమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యుడు లయన్ మన్నెం రామమోహన్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం, తెలుగువారికంటూ ఒక రాష్ట్రం ఉండాలని అప్పటి వరకు మదరాసీలు అని పిలవబడుతున్న మనకు ప్రత్యేక గుర్తింపు కావాలని పోరాడి ప్రాణత్యాగం చేసి తెలుగు రాష్ట్రాన్ని సాధించిన అమరజీవికి తెలుగువారందరూ ఎప్పటికీ రుణపడి ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నందలూరు ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ ఎంబలూరు నరసింహస్వామి, గెలివి మల్లికార్జున శెట్టి, మేడా వెంకటకుమార్, లయన్ కుర్రా మణియాదవ్, ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, జంగంశెట్టి హరికృష్ణ, గంధం గంగాధర్, గురుప్రసాద్, గుండు సురేష్, సునీల్ రెడ్డి, గండికోట కృష్ణకుమార్‌లు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలు, ఆలోచనలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుగు శివయ్య, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, ఆంజనేయులు, అబ్దుల్ రౌఫ్, నాగరాజు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయని అమరజీవి పొట్టి శ్రీరాములు అని రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్ అన్నారు. ఆదివారం రాయచోటి తహసీల్దార్ కార్యలయంలో అమరజీవి పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.


రాయచోటి టౌన్: పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెవెన్యూ అధికారులు


రైల్వేకోడూరు అర్బన్: నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పేదలకు దుస్తుల పంపిణీ


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు

వీరబల్లి : మండలంలోని ఓదివీడు కస్బాకు చెందిన ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం నాయకుడు షేక్ షాహీర్ బాషా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి చేతులమీదుగా పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఆకేపాటి మాట్లాడుతూ రంజాన్ ఉపవాసాల మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందన్నారు. స్తోమత కలిగిన ప్రతి ఒక్కరూ దానధర్మాలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా షాహీర్ బాషాను ఆకేపాటి అభినందించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, వీరనాగిరెడ్డి, వివేకానందరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, అన్నమయ్య జిల్లా వైఎస్సార్ పార్టీ ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, సర్పంచ్‌లు శివ, నాగిరెడ్డి, గోపినాథ్ రెడ్డి, నేతి ఆంజనేయులు, రామ్ జయచంద్ర, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నరేష్ స్వామి, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఒంటిమిట్ట : మండల పరిధిలోని రాచపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. తిరుపతికి చెందిన రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో నాగార్జున రాజు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు వైద్యులు చికిత్స అందించారు. అనంతరం మండల పరిధిలోని సాలాబాదు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ముమ్మడి నిరంజన్ రెడ్డి వివాహ వేడుకకు కడప మేయర్ సురేష్ బాబుతో కలిసి ఎమ్మెల్యే ఆకేపాటి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కె.ఓబుల్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటం అధికం.. ఆచరణలో విఫలం


పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న అనంతంపల్లి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం

మండల పరిధిలోని అనంతంపల్లి పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. కూటమి ప్రభుత్వం ఆర్భాటం అధికం.. ఆచరణ శూన్యం అన్న చందంగా తయారైంది. ఒకవైపు చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా సంపద సృష్టించి పంచాయతీలను అభివృద్ధి చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడమే తప్పా ఆచరణలో విఫలమైందనే వాదనను మండల ప్రజలు వెలిబుచ్చుతున్నారు. ఇందుకు అనంతంపల్లిలోని చెత్త నుంచి సంపద కేంద్రమే నిదర్శనమని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముందు సదరు కేంద్రాన్ని అభివృద్ధి చేసి సంపద సృష్టి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

– పుల్లంపేట